




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 342 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 12 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :342 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 12 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి



- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా

- మిగతా 2లో



## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

### వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి

- మిగతా 2లో

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

## సీఎం చంద్రబాబు పిలుపు

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2లో



## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా
- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి

- మిగతా 2లో


## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

### పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు

- ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల చేసిన అచ్చెన్న
- ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక అని వ్యాఖ్య
- జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో





## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

- ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు
- ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు
- ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం




పెన్ పవర్ డెస్క్:అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది.

- మిగతా 2లో

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు:

### బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక



- ఏఐపై అర్థవంతమైన మానవ పర్యవేక్షణ ఉండాలని సూచన
- 'అల్గారిథమ్ నిర్ణయించింది' అనే సమాధానం ఆమోదయోగ్యం కాదన్న ఆర్బీఐ
- రుణాలు, కస్టమర్ సేవలో ఏఐ ఎంతో ఉపయోగకరమని వెల్లడి
- ఏఐతో జరిగే మోసాలను ఎదుర్కోవడానికీ ఏఐయే అవసరమని వ్యాఖ్య

- మిగతా 2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

- మిగతా 2లో





## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### జమిలి ఎన్నికలకు బ్రేక్ పడినట్లేనా?.. తెలుగు రాష్ట్రాలలో సీట్ల పెంపు లేనట్లేనా?

2029 లో జమిలి ఎన్నికలకు సంబంధించి కొంత సందిగ్ధత నెలకొంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుదల కూడా కష్టమేనని అనిపిస్తుంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరును చూస్తుంటే ప్రస్తుతం ఉభయ సభల్లో డీలిమిటేషన్ కు సంబంధించిన బిల్లులు ఆమోదం పొందే అవకాశాలు లేవు. ఇప్పటికే ఒకసారి వీగిపోయిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి ఉభయ సభల ముందుకు తెచ్చి ఆమోదం పొందుదామని కేంద్ర ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా వీలు కుదరడం లేదు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అనేది కూడా జరిగేది కష్టంగానే కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలకు విపక్షాలు అడ్డుకట్ట వేస్తుండటంతో ఈ దఫా రెండు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుదలపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బొద్దింకల ఉద్యమంతో...**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగ జెన్ జీల ఉద్యమం తర్వాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ డీలిమిటేషన్ కు మద్దతిచ్చిన విపక్షాల్లోని డీఎంకే వంటివి కూడా ఇప్పుడు వెనక్కుతగ్గాయి.దీంతొ వన్ నేషన్ వన్ ఎలక్షన్, డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ల అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నట్లుంది. జమిలి ఎన్నికలకు రాజ్యాంగ, న్యాయ, సవరణలు అవసరం. ఈ అడ్డంకులను అధికమించేందుకు బీజేపీ చేస్తన్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉభయ సభల్లో మేజార్టీ కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా అది బెడిసి కొడుతుంది. వర్షాకాలం పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను తేవాలని ఆలోచించిన ప్రభుత్వం చివరి నిమిషంలో విరమించుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ను చీల్చి ఎంపీలను తమ వైపునకు తిప్పుకున్నా అనుకున్న మెజారిటీ మాత్రం రాలేదు.

**మెజారిటీ లేకపోవడంతో...**

లోక్ సభలో ఎన్డీయేకు తగిన మేజార్టీ ఉన్నప్పటికీ రాజ్యసభలో లేదు, ప్రతిపక్ష ఇండి కూటిమికి బలం ఉంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యంగ సవరణ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో గట్టెక్కే పరిస్థితి లేదు. బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితం ఇవ్వడం లేదు. అన్నీ సాఫీగా జరుగుతున్న సమయంలో బీజేపీపై బొద్దింకలు వచ్చి పడ్డాయి.రాష్ట్ర విభజన తర్వాత తెలుగు రాష్ట్రాలు తమ అసెంబ్లీ స్థానాలను పెంచుకోవచ్చు. విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం, ఏపీ అసెంబ్లీ స్థానాలు 175 నుండి 225కి, తెలంగాణ స్థానాలు 119 నుండి 153కి పెరగాలి కానీ దానిని కేంద్రం అమలు చేయలేదు.తమకు అవసరమైన జమ్మూ కాశ్మీర్ వంటి చోట్ల అసెంబ్లీ స్థానాలను బీజేపీ పెంచింది కానీ, తెలుగు రాష్ట్రాల్లో పెంచడం లేదు. దీంతో ఈ సారి కూడా ఏపీ, తెలంగాణలో సీట్ల పెంపుదల కష్టమేనని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్ధిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- మొదటి పేజి తరువాయి

విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు.నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఫ్యూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది.

ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని

సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- మొదటి పేజి తరువాయి

ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు.భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు.

ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు.పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- మొదటి పేజి తరువాయి

దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు.పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు: బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు.ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే.. నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు.నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు.నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన జీవోను మంత్రి విడుదల చేశారు.పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు.ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది.మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభం

## గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 11:** గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, సకాలంలో రవాణా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న '102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను మంగళవారం విశాఖపట్నంలో జాయింట్ కలెక్టర్ జి. విద్యాధ రి ప్రారంభించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులతో కలిసి ఆమె జెండా ఊపి వాహనాలను సేవలకు అందుబా టులోకి తీసుకొచ్చారు. మాతా–శిశు మరణాల రేటును తగ్గిం చడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహిం చడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడం, పేద కుటుంబాలపై రవాణా భారం తగ్గించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని జేసీ తెలిపారు. ప్రభుత్వ ఆసుప త్రుల్లో ప్రసవించిన బాలింతలు, నవజాత శిశువులను ఇద్దరు సహాయకులతో కలిసి ఉచితంగా ఇంటికి చేర్చే పోస్ట్‌నేటల్ డ్రాప్‌బ్యాక్ సేవలు ఈ వాహనాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధప డుతున్న మహిళలకు ఐరన్ సుక్రోజ్ చికిత్సలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, రక్త మార్పిడి వంటి అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రులకు ఉచితంగా తరలించి, తిరిగి ఇంటికి చేర్చే సదుపాయం కూడా ఉందన్నారు. విశాఖ జిల్లాకు మొత్తం 16 అత్యాధునిక 102 వాహనాలు కేటాయించగా, కేజీహెచ్ వద్ద 9, అగనంపూడి వద్ద 2, విక్టోరియా ఆసుపత్రి వద్ద 5 వాహనాలను అందుబాటులో ఉంచినట్లు జేసీ వెల్లడించారు. వాహనాల్లో రియర్ సీట్ బెల్టులు, ఎయిర్‌బ్యాగులు, అగ్నిమా పక పరికరాలు, ఏసీ, మొబైల్ ఛార్జింగ్, హ్యాండ్ శానిటైజర్ తదితర సౌకర్యాలతో పాటు రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్, ఎమర్జెన్సీ అలర్ట్ స్విచ్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రయాణ సమయంలో తల్లి–శిశు ఆరోగ్యం, శిశు పోషణ, ప్రసవానంతర సంరక్షణపై అవగాహన కల్పించే ఆడియో సందేశాలను కూడా ప్రసారం చేస్తారని చెప్పారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని, డ్రైవర్లకు ఎలాంటి రుసుము లేదా టిప్పులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

జిల్లాలో 2025–26లో 24 వాహనాల ద్వారా 9,988 మంది లబ్ధిదారులు సేవలు పొందగా, 2026–27 ఆర్థిక సంవత్స రంలో ఇప్పటివరకు 3,274 మంది ఈ సేవలను వినియోగిం చుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. ఉష, డీసీహెచ్‌ఎస్ డా. నరేంద్ర సింగ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ డా. అప్పారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ

### 17న శంకరన్ ఆడిటోరియంలో తరగతులు

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 11:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. విద్యార్థులు, యువతకు మెరుగైన విద్యా అవకాశాలు, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 10 గంటలకు పాడేరులోని శంకరన్ ఆడిటోరియంలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అనుభవజ్ఞులతో డీఎస్సీకి సంబంధించిన ముఖ్యమైన మూడు అంశాలపై ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు వెల్లడించారు. డీఎస్సీకి సన్నద్ధమవుతున్న జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పొందడం ద్వారా పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు, యువత ప్రతిభను వెలికితీసి పోటీ పరీక్షల్లో రాణించేలా జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.



# బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఆయుధాలు భద్రపరిచే గదిను ప్రారంభించిన ఐజీ.



**పోలీస్ సిబ్బంది, శాంతిభద్రతల పరిరక్షణకు మరింత భరోసా**

**పార్వతీపురం మన్యం. ఆగస్టు 11 పెన్ పవర్.** పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి మరింత భద్రత సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు ఉపయోగపడే ఆయుధాలను భద్రపరిచేందుకు, పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గరలో నూతనంగా నిర్మించిన బెల్ ఆఫ్ ఆర్మ్స్ ను మంగళవారం నాడు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ముందుగా ఐజీ సిబ్బంది వద్ద నుండి గౌరవ వందనం స్వీకరించగా, పార్వతీ పురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఐపిఎస్ పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన పరికరాలు, ఆయుధ సామగ్రి, ఇతర సంబంధిత వస్తువులను సక్రమంగా భద్రపరచడం, నిర్వహించడం మరియు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంచడం కోసం ఏర్పాటు చేసిన ఈ బెల్ ఆఫ్ ఆర్మ్స్ సదుపాయం పోలీస్ శాఖ సామర్థ్యాన్ని మరింత పెంపొందించనుంది ఐజీ పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఆయుధాల భద్రత, వాటి సంరక్షణ, సాంకేతికంగా మెరుగైన నిర్వహణ ఎంతో కీలకమని ఆయుధ సామగ్రి విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పర్యవేక్షించాలని, ఆయుధాలు, సంబంధిత సామగ్రిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, నిర్దేశిత నిబంధనల ప్రకారం భద్రపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఐపిఎస్ అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సిఐ రమణమూర్తి, పార్వతీపురం పట్టణ సిఐ బి.వెంకట్రావు, ఆర్ఐ లు నాయుడు, రాంబాబు, ఆదినారాయణ మరియు ఆర్ఎస్సై లు మరియు సిబ్బందిపాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- పెండింగ్‌లోని అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు, తాగునీటి పథకాలు త్వరగా పూర్తి చేయాలి
- నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 11:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం (ఏడీపీ) కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం అధికారులను ఆదేశించారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాడేరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ నిషాంతి.టి అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లాలో ఏడీపీ కింద జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు సాధించిన ప్రగతి, నిధుల వినియోగం, చేపట్టిన పనుల పురోగతిపై జిల్లా యంత్రాంగం నీతి ఆయోగ్ సభ్యునికి నివేదిక సమర్పించింది. జిల్లాలో గుర్తించిన 21 మారుమూల గిరిజన ఆవాసాలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్, సోలార్ నీటి సరఫరా పథకాల పురోగతిని అధికారులు వివరించారు. పాఠశాల భవనాల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ఆధునీకరణ పనులతో పాటు చిన్నారుల పోషణ, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు వివరించారు. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నీతి ఆయోగ్ సభ్యుడు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కమ్యూనిటీ లైబ్రరీలను బలోపేతం చేసి, యువత, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా డిజిటల్ సదుపాయాలతో ఆధునీకరించే చర్యలపై చర్చించారు. మారుమూల ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలను మెరుగుపరిచేందుకు కొత్త అంబులెన్సుల కొనుగోలు, నిర్వహణ అంశాలను కూడా సమీక్షించారు. కాఫీ, మిరియాలు వంటి వాణిజ్య పంటల ప్రోత్సాహం, సూక్ష్మ సేద్యం, మట్టి పరీక్షలు, జలవనరుల నిర్వహణపై సమీక్ష జరిగింది. మారుమూల ప్రాంతాలకు రహదారి రవాణా, విద్యుదీకరణ, మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ విస్తరణ పనుల పురోగతిని అధికారులు వివరించారు. ఐటీడీఏ పరిధిలోని ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగల ( పివిటిజి) కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న విద్య, వైద్యం, గృహ, తాగునీరు, రవాణా, ఉపాధి, స్వయం ఉపాధి తదితర సదుపాయాలపై కూడా నీతి ఆయోగ్ సభ్యుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం అభినందించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ, నీతి ఆయోగ్ అధికారులు, సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, సీపీఓ ప్రసాదరావు, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్య, గృహ నిర్మాణ, వైద్య, వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, మత్స్య, పరిశ్రమల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- ఆగస్టు 13 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా'
- దేశభక్తిని పెంపొందించేలా జిల్లాలో విస్తృత కార్యక్రమాలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 11:** ఆగస్టు 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణి జ్య సంస్థ, ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రోజుల పాటు జాతీయ జెండాను ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. పరిపాలనా యంత్రాంగం, ప్రజాప్రతి నిధులు, ప్రజలు సమష్టిగా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సంద ర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'దేశ నిర్మాణం) ప్రచార కార్యక్రమాలను ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలు కేవలం స్వాతంత్ర్య వేడుకలను వీక్షించే ప్రేక్షకులుగా కాకుండా, దేశ నిర్మాణంలో తాము భాగస్వాములమనే భావనతో స్వచ్ఛందంగా పాల్గొనేలా ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 14న అటవీ, ఉద్యా నవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద, ముఖ్యమైన ప్రదేశాల్లో మొక్కలు నాటి, జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయా లని కోరారు. ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రభుత్వ భవనాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థు లకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, దేశ భవిష్యత్తు కోసం తాము చేయగలిగిన కృషిపై స్వయంగా ప్రతిజ్ఞలు చేయిం చేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

'అనే నేను' సోషల్ మీడియా ప్రచారం

యువత, విద్యార్థులు, ప్రముఖులు, క్రీడాకారులు, పౌరులు 2026 హ్యాష్‌టాగ్‌లతో జాతీయ జెండాను చేతిలో పట్టుకుని "అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా..." అంటూ 30 నుంచి 60 సెకన్ల సెల్ఫీ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కలెక్టర్ కోరారు.

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర––2047 లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 'ఆలోచిద్దాం.. ఆచరిద్దాం.. వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం' అనే నినాదంతో ముందుకు సాగాలని జిల్లా ప్రజలకు, అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు.



## జీవీఎంసీ ఎన్నికల్లో సామాన్యులకే కాంగ్రెస్ టిక్కెట్లు

**ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాడే వారికి తొలి ప్రాధాన్యం: ప్రియాంక దండి**



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 11:** జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థులుగా సామాన్యులకు, యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి తెలిపారు. సామాన్యులు, యువత, మహిళలు తమ జీవితాల్లో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకుని సమాజంలో మార్పు తీసుకురాగల సామర్థ్యం వారిలో ఉందని ఆమె అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న వారికి ఎన్నికల్లో అవకాశం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగేలా టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని ప్రియాంక దండి పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాడుతున్న నాయకులకు తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రశ్నించే వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తూ, అధికార పార్టీ నాయకులను ధైర్యంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన నాయకత్వాన్ని అందించగల అభ్యర్థులను జీవీఎంసీ ఎన్నికల్లో ఎంపిక చేస్తామని ప్రియాంక దండి తెలిపారు.

## ఘనంగా నాతవరం--తాండవ నూతన రహదారి ప్రారంభం.....

- తాండవ రిజర్వాయర్ గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు.....



**నాతవరం, పెన్ పవర్ (ఆగస్టు 11)**నాతవరం నుండి తాండవ వరకు సుమారు రూ.3 కోట్ల 50 లక్షలతో రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి) ఆధ్వర్యంలో నిర్మించిన 7 కిలోమీటర్ల నూతన రహదారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.అనంతరం తాండవ రిజర్వాయర్ వద్దకు చేరుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా గంగా హారతి ఇచ్చిన అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా గేట్లను ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రహదారి నిర్మాణ క్రమాన్ని వివరించారు. మొదట ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును ఆర్ అండ్ బికి బదిలీ చేయించి, నిధులు మంజూరు చేయించడానికి ప్రభుత్వం ఎంతో శ్రమించిందని తెలిపారు. కాంట్రాక్టు పనుల్లో మిగిలిన నిధులతో ఎంతో నాణ్యంగా ఈ తారు రోడ్డును నిర్మించినట్లు ఆయన స్పష్టం చేశారు.అయితే కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన తారు రోడ్లపై ఇనుప చక్రాలున్న ట్రాక్టర్లు నడపడం వల్ల రోడ్లు త్వరగా పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇనుప చక్రాలతో తారు రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెట్టాలని పోలీస్ అధికారులను ఆయన కఠినంగా ఆదేశించారు.వ్యవసాయంలో రైతులు ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని స్పీకర్ సూచించారు. మందులు చల్లుకోవడానికి వీలుగా ప్రతి మండలానికి మూడు డ్రోన్లను ప్రభుత్వ సాయంతో అందిస్తామని ప్రకటించారు. యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూస్తామని, రైతులు కూడా అవసరమైన మేరకే ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు.నియోజకవర్గంలో వ్యవసాయానికి, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని స్పీకర్ తెలిపారు. నాతవరం మండలంలో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా రూ.16 కోట్లతో 136 మెటల్ రోడ్లను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసినట్లు వెల్లడించారు.నాతవరం మండలానికి రూ.70 కోట్ల 44 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 75 మంది లబ్ధిదారులకు సుమారు రూ.48 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు గుర్తుచేశారు.తాండవ రిజర్వాయర్ వద్ద భద్రత కోసం రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు జోగుంపేట వరకు లైటింగ్ ఏర్పాటు చేయడానికి అంచనాలు రూపొందించాలని విద్యుత్, సంబంధిత అధికారులను స్పీకర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను తానే స్వయంగా సమకూరుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్, ఆర్డీవో వి.వి. రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, జనసేన సూర్యచంద్ర, తాండవ కమిటీ మెంబర్లు, నాతవరం మండల టిడిపి నాయకులు, తాండవ రిజర్వాయర్ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాలయం లో మహా రుద్రాభిషేకం మాస శివరాత్రి కూర్మన్న



**పాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 11** మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా అగనంపూడి పెదమడక శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5.00 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకంనిర్వహించారు . మధ్యానం 12.30 గం.లకు దివ్య అశోక్ కుమార్ , లక్ష్మీ రోహిత దంపతులు ఆర్థిక సహాయం తో అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు .

సాయంత్రం 7.00 గం.లకు నందీశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకము నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు గెద్దాడ అప్పల రాజు, కొలిపాక అప్పారావు, కరణం సన్నీ, గోట్యాడ లోవరాజు, అమరపిన్ని అప్పల రాజు, గుదే అప్పల రాజు, దాన బాల కృష్ణ, కండిపిల్లి పైడిరాజు గ్రామ పెద్దలు బేతా హనుమంత రావు, లక్కరాజు వెంకట రమణ, బోయిన రామకోటి ,భక్తులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన ఘనత గొడ్డలి పార్టీదే :పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 11** మహా విశాఖ నగర పాలక సంస్థ 88వ వార్డులో మంగళ పాలెం లో మాజీ కార్పొరేటర్ ముల్లి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని బాగు చేస్తాడనే నమ్మకంతో ప్రజలు వైసీపీకి పట్టం కడితే రాష్ట్రాన్ని అన్నింటా ముంచేసాడని ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తూ నడిపిన గొడ్డలి పార్టీని ప్రజలు దూరంగా ఉంచాలని పల్లా అన్నారు .కూటమి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వచ్చే ఏడాదిలో పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని,అమరావతి పనులు కూడా చకచకా జరుగుతున్నాయని తెలిపారు.2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని,ఇంటింటికి వెళ్లి ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గాజువాక లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు ముమ్మిడివరపు రాము, 88 వ వార్డు ప్రధాన కార్యదర్శి,పార్టీ కార్యకర్తలు ,నాయకులు ,మహిళలు తదితరులు పాలుగొన్నారు .

## విజ్ఞాన్ కళాశాల లో సైబర్ సెక్యూరిటీ విద్యార్థులకు అల్యూమ్ని ఇంటరాక్షన్ సెషన్




**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 11** విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో అల్యూమ్ని ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశ్రమ అవగాహన, కెరీర్ పెంపొందించడమే లక్ష్యమని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటన లో తెలిపింది . టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లో సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెలువర్తి వెంకట అనురాధ విద్యార్థులతో పరస్పరం మాట్లాడి, తన వృత్తిపరమైన అనుభవాలను పంచుకున్నారు. ఐటీ రంగంలో విజయానికి సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్లు, రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమని వివరించారు.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పరిశ్రమ అవసరాలు, విద్యా దశ నుంచి వృత్తిపరమైన జీవితానికి మారే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సాంకేతిక మరియు సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకుని భవిష్యత్ కెరీర్ అవకాశాలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావడానికి ప్రేరణనిచ్చింది. డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్; డా. వి. మధుసూదనరావు, రెక్టర్; మరియు డా. కె. రోహిత్ కుమార్, హెడ్ -- సి.ఎస్.ఈ. సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల కెరీర్ అభివృద్ధి, పరిశ్రమ అవగాహన మరియు వృత్తిపరమైన నైపుణ్యాల పెంపునకు అల్యూమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

# చంటిబాబు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన బొబ్బిలి లక్ష్మణ్

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 11:** కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న గూడెం కొత్తవీధి మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబును వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ పరామర్శించారు. వైసీపీ నాయకులతో కలిసి చంటిబాబు స్వగ్రామమైన దొడ్డికొండ గ్రామానికి వెళ్లిన ఆయన, చంటిబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బొబ్బిలి లక్ష్మణ్ మాట్లాడుతూ.. వైద్యులు సూచించిన విధంగా మందులను క్రమం తప్పకుండా వాడుతూ, పూర్తి విశ్రాంతి తీసుకోవాలని చంటిబాబుకు సూచించారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ స్థితికి రావాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ, వైసీపీ మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, వైసీపీ నాయకులు రామ్మూర్తి, చందు, కృప తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల బారిన గిరిజనం.. ఆర్ఎంపి డాక్టర్ల జేబులకు ధనం.



- గిరిజనుల జేబులకు పడుతున్న చిల్లు.
- అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకుని భారీగా సొమ్ము చేసుకుంటున్న ఆర్ఎంపీ డాక్టర్లు.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 11.** మండలంలో కొంతమంది ఆర్.ఎం.పి డాక్టర్ల హవా కొనసాగుతుంది. అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకుని వారికి వచ్చిన వ్యాధిని వివిధ రకాల టెస్టులతో భయభ్రాంతులకు గురిచేసి భారీగా రోగులనుండి డబ్బులు దండుకుంటున్నారు. దీంతో అమాయక గిరిజన ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఆర్ఎంపి వైద్యంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తూ వారి అభిప్రాయాలను వెల్లడి చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ వాస్తవానికి ఆర్ఎంపీ డాక్టర్లు రోగికి ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ వంటివి ఏర్పాటు చేసుకుని రోగికి టెస్టులు చేసి, అనంతరం రోగనిర్ధారణ చేసి అసాధారణ రీతిగా వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. సూది మందులు ఇవ్వడంతో పాటు, సెలైన్ బాటిల్లను కూడా రోగులకు పెడుతున్నారన్నారు. అత్యవసర సమయంలో ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సిన ఆర్ఎంపీ డాక్టర్లు పెద్ద ఎత్తున వైద్యాన్ని అందిస్తున్నట్టు నటించి భారీ ఎత్తున రోగులనుంచి డబ్బులను వసూలు చేస్తున్నారని పలువురు వాపోయారు. మండల కేంద్రంలో ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రి రోగులతో కిక్కిరిసి ఉండడంతో ఎక్కువమంది గిరిజనులు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సను పొందడానికి ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని పలువురు ఆర్ఎంపీ డాక్టర్లు అందిన కాడికి గిరిజనుల నుండి డబ్బులను దండుకుంటున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో ఒక ఆర్ఎంపీ డాక్టర్, స్థానిక ఎంపీడీవో ఆసుపత్రి ఎదురుగా ఒక ఆర్ఎంపి డాక్టర్, మనీ ఫుట్ వేర్ ఎదురుగా మరొక ఆర్ఎంపీ డాక్టర్ ల వృత్తి మూడు పువ్వులు ఆరు కాయలుగా నిరాటంకంగా సాగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల పాడేరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఆర్ఎంపీ డాక్టర్లకు ప్రథమ చికిత్స అందించాలే తప్ప సూది మందులు ఇవ్వడం గానీ, సెలైన్ బాటిల్ పెట్టి వైద్యం అందించడం చేయకూడదని, వైద్యం అందించిన పక్షంలో కేసులు నమోదు చేయడం జరుగుతుందని గట్టిగా హెచ్చరికలు చేశారు. దీంతో వీరు రెండు రోజులపాటు నిశ్శబ్దంగా ఉండి తర్వాత వారి కార్యక్రమాలను యధావిధిగా కొనసాగిస్తున్నట్లు పలువురు తెలిపారు. అలాగే ఆర్ఎంపీ డాక్టర్లకు అనుకూలంగా ఉండే మందుల షాపులకు మందులు చీటీని రాసి ఇస్తున్నారని, మందుల దుకాణాల యజమానులు ఇష్ట రాజ్యంగా రేట్లు వేసి అధికతరులకు అమ్ముతున్నట్లు పలువురు రోగులు వాపోతున్నారు. మన్యం గిరి ప్రజలలో చైతన్యం లేకపోవడంతో ఎక్కువమంది ఆర్ఎంపీ డాక్టర్లని ఆశ్రయిస్తున్నారు. దీంతో అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకుని ఆర్ఎంపీ డాక్టర్లు తమ జేబులు నింపుకొని పబ్బం గడుపుకుంటున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సిన ఆర్ఎంపీ డాక్టర్లు వైద్యం చేయడంపై పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. చిన్నపాటి వైరల్ జ్వరాలకు సైతం వేలల్లో, రూపాయలను వసూలు చేస్తున్నట్టు పలువురు చెప్పుకుంటున్నారు.జరగరానిది ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు అనేదానిపై ప్రశ్నిస్తున్నారు. ఆర్ఎంపీ డాక్టర్ల వైద్యం తీసుకుని అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయని, గుట్టుచప్పుడు కాకుండా వాటిని కప్పి పుచ్చు కున్నారని పలువురు బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్ఎంపీ డాక్టర్ల వైద్యంపై ఆరా తీసి, ఆర్ఎంపీ డాక్టర్ల పై నిఘా పెట్టి అమాయక గిరిజనులను కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు తీవ్రమైన సమస్యగా గుర్తించి సమస్య పరిష్కారానికి తగు మార్గాన్ని సూచించి ఆర్ఎంపి వైద్యానికి చెక్ పెట్టాలని, అమాయక గిరిజనులు ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# నేడు చింతపల్లిలో టిడిపి మండల బాడీ యూనిట్ సమావేశం.

**చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు.**



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 11.** నేడు( బుధవారం) చింతపల్లి తెలుగుదేశం పార్టీ మండల బాడీ యూనిట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాన్ని మధ్యాహ్నం 12:50 నుండి మండల కేంద్రంలోని గిరిజన భవన్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పిఏసిఎస్ చైర్మన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు క్లస్టర్ ఇంచార్జీలు, మండల ప్రధాన కార్యదర్శి, బూత్ లెవెల్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, గ్రామ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ు

## బాధితులకు సిఎం సహాయ నిధి అందజేసిన పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 11** జీవీఎంసీ 66వార్డ్ మాజీ కౌన్సిలర్, జనసేన మహిళ నాయకురాలు లంక లత హాస్పిటల్ లో చికిత్స చేయించుకుంటున్న సంగతి విదితమే . చికిత్సకి సంబంధించి సీఎంఆర్ రిలీఫ్ ఫండ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపేణ ముఖ్యమంత్రి తక్షణ సాయం కింద 3 లక్షల రూపాయలు , 85 వ వార్డు లో మరొక బాలిక హారిక ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కొరకు రూపంగా 2 లక్షల49 వేల రూపాయలు సీఎం సహాయ నిధి నుండి మంజూరు చేయించి స్వయంగా బాధితులకు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు,స్థానిక ఎంఎల్ ఏ పల్లా అందజేశారు .

## మాజీ సర్పంచ్ చొరవతో విద్యుత్ పునరుద్ధరణ...!

- గుమ్మలపాలెం లోవిరిగి పడిన 5 విద్యుత్ స్తంభాలు యుద్ధప్రాతిపాదిన నిర్మాణం.
- విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు.



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు11:**రెండు రోజుల పాటు కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షాలకు గుమ్మాలపాలెం బంగారంపేట మధ్య 5 విద్యుత్ స్తంభాలు విరిగిపడిన వాటిని ఆ శాఖ అధికార్లు ప్రత్యేక చొరతో ఒక్క రోజులోనే యుద్ధప్రాతిపధకన నిర్మించి విద్యుత్ సరఫరా అందించారు.


దీంతో అంతాడ మాజీ సర్పంచ్ సుర్ల చంద్రరావు పిర్యాదుతో స్పందించిన విద్యుత్ సిబ్బంది అదే రోజు ఆయా గ్రామాలకు సరఫరా పునఃరుద్ధరించటంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్ సౌకర్యం మెరుగు పడినట్టు మాజీ సర్పంచ్ చంద్రరావు తెలిపారు. విద్యుత్ శాఖ ఏ ఈ నాగ సతీష్ కు ఈ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడిన సమాచారాన్ని ఫోన్ ద్వారా తెలియజేయడంతో స్పందించిన ఏ ఈ ఒకే రోజు విరిగిపోయిన స్తంభాలను నిర్మించడంపట్ల బంగారంపేట, గుమ్మళ్ళపాలెం గ్రామాల ప్రజలు తరుపున ఏ ఈ నాగ సతీష్ మరియు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యుత్ సమస్య పరిష్కారానికి సుజనకోటలో విద్యుత్ శాఖ అధికారులు

- పి జి ఆర్ ఎస్ లో వినతి పత్రానికి స్పందన - సమస్య పరిష్కారానికి ముందడుగు.
- సామాజిక కార్యకర్త వెంగడ జగన్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 11.** విద్యుత్ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించినట్లు సామాజిక కార్యకర్త వెంగడ జగన్ తెలిపారు. మండలంలో గల సుజనకోట పంచాయతీ, సుజనకోటలో జూన్ 8న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్ లో చేసిన ఫిర్యాదుపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా జగన్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం.. పిజిఆర్ ఎస్ లో ఇచ్చిన వినతి పత్రం మేరకు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ సిబ్బందితో కలిసి మంగళవారం సుజనకోట గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని శిథిలావస్థకు చేరిన, పాతబడిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి, వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. అలాగే నీటి ముంపునకు గురవుతున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను సురక్షితమైన ప్రదేశానికి మార్చేందుకు అధికారులు అంగీకరించారు. దీంతో గ్రామస్తులకు ఎదురవుతున్న విద్యుత్ సంబంధిత ఇబ్బందులు, ప్రమాదాల నుంచి ఉపశమనం కలగనుంది. అదేవిధంగా గ్రామంలోని ప్రతి ఇంటి విద్యుత్ మీటర్‌కు సీల్ వేసే ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో గ్రామస్తులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామ సమస్యలపై స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కార చర్యలకు హామీ ఇచ్చిన విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.






# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

- లోకేష్ ఇప్పటికైనా కళ్లు తెరవాలి
- లేదంటే పతనం తప్పదు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్,ఆగస్టు 11 :** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరగలేదని ప్రభుత్వం భావిస్తే, సీబీఐ విచారణకు ఆదేశించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా యువత తరఫున వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్యమబాట పట్టాయని తెలిపారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచి శాంతియుతంగా ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైన తమ పార్టీ శ్రేణులను సుమారు 300 మంది పోలీసులతో అడ్డుకో వడం, ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే శకటం తరహాలో భారతమాత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలతో రూపొందించిన శకటాన్ని జగదాంబ జంక్షన్ వద్ద ఉదయం నాలుగు గంటల నుంచే పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే సీబీఐ విచారణకు ఆదేశించి నిజానిజాలను ప్రజల ముందు ఉంచాలని వాసుపల్లి డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించా రు. చంద్రబాబు, నారా లోకేష్ పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని అన్నారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర, జిల్లా ఆర్టీఐ జనరల్ సెక్రటరీ ఆరుగుల రాజు, జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, జిల్లా బూత్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గంగిరి ధనరాజు, సౌత్ స్టూడెంట్ ప్రెసిడెంట్ వీటీ కృష్ణ, పిలక మోహన్, 39వ వార్డు జనరల్ సెక్రటరీ వెంకటి, రామోలు సత్య, 39వ వార్డు యూత్ ప్రెసిడెంట్ మైలిపిల్లి ఆదినారాయణ, 39వ వార్డు స్టూడెంట్ ప్రెసిడెంట్ మైలిపిల్లి కాసుబాబు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## గూడెం కొలనిలో బోడకొండమ్మ శాంభవి దేవికి ఆషాఢం సారె

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 11:** మండలంలోని గూడెం కొలని గ్రామంలో కొలువైన శ్రీశ్రీశ్రీ బోడకొండమ్మ శాంభవి దేవికి ఆషాఢమాసం సారె సమర్పణ కార్యక్రమాన్ని సమర సత సేవ ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా సహ మహిళా కన్వీనర్ కొక్కుల లావణ్యగీత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పండ్లు, పసుపు, కుంకుమ, వస్త్రాలు తదితరాలతో కూడిన ఆషాఢమాసం సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గెమ్మెలి నర్సమ్మ, కోడా లలితకుమారి (డీలర్), శకుంతల (ఉపాధ్యాయురాలు)తో పాటు గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోడకొండమ్మ శాంభవి దేవి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మహిళలు ఆకాంక్షించారు.

## ఎన్ఎం నేషనల్ స్కాలర్షిప్ కు ఎంపికైన కరిముఖిపుట్టు పాఠశాల విద్యార్థి

కరిముఖిపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ అప్పలరాజు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 11.** మండలంలో గల కరిముఖిపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కోడా సూర్యప్రకాష్ జాతీయ ప్రతిభ మరియు ఆర్థిక సహకార ఉపకార వేతన పథకం (ఎన్.ఎం.ఎం.ఎస్) లో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2025 –26 విద్య సంవత్సరంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభవంతులైన విద్యార్థులకు చదువును మధ్యలో ఆపేయకుండా కొనసాగించుటకు భారత ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పథకంలో సూర్య ప్రకాష్ ఎంపికయ్యాడనీ తెలిపారు. సూర్య ప్రకాష్ ను పాఠశాల సిబ్బంది అభినందించారు. తమ పాఠశాల విద్యార్థి ఎన్.ఎం.ఎం.ఎస్ కు ఎంపిక కావటం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రాంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ గాసన్న, కూడా వెంకటరమణ, కమలాకర్ రావు, చిన్న గున్ని పడాల్, డోంబ్రు, తిరుపతి, చంద్రమ్మ, రాంబాబు, ఎస్ఎంసి సభ్యులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళింగ వైశ్యుల సమస్యల పరిష్కారానికి పోరాడాలి

నూతన బీసీ అధ్యక్షుడు పట్నాన రమణకు వాసుపల్లి సూచన



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 11:**
కళింగ వైశ్యుల సమస్యలు, వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైఎ స్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సూచిం చారు. నూతనంగా కళింగ వైశ్య బీసీ అధ్యక్షుడిగా నియమి తులైన పట్నాన రమణ మంగళవారం ఆసీలమెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోమటి పెద్దలు వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో కళింగ వైశ్యులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఆ వర్గం రాజకీయంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేందుకు నాయకులు, యువత కృషి చేయాలని సూచించారు. పాతనగరంలో కొలువై ఉన్న వాసవీ మాత ఆశీస్సులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మళ్లీ పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వం రావాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మరింత బలోపేతం కావాలని అన్నారు.

కళింగ వైశ్య నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలోనూ, సమస్యలపై పోరాటంలోనూ వాసుపల్లి గణేష్‌కుమార్ ముందుంటారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడానికి కళింగ వైశ్య వర్గం అండగా ఉంటుందని తెలిపారు.

కళింగ వైశ్య బీసీ అధ్యక్షుడిగా తనను నియమించడంలో వాసుపల్లి గణేష్‌కుమార్ అందించిన సహకారానికి పట్నాన రమణ కృతజ్ఞతలు తెలిపారు. కళింగ వైశ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా ఆర్టీఐ జనరల్ సెక్రటరీ ఆరుగుల రాజు, జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ చోడిపల్లి శివ, జిల్లా బూత్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గంగిరి ధనరాజు, సౌత్ స్టూడెంట్ ప్రెసిడెంట్ వి.టి. కృష్ణ, 39వ వార్డు జనరల్ సెక్రటరీ వెంకటి, రామోలు సత్య, 39వ వార్డు యువజన అధ్యక్షుడు మైలిపల్లి ఆదినారాయణ, 39వ వార్డు విద్యార్థి అధ్యక్షుడు మైలిపల్లి కాసుబాబు, ఇబ్రహీం, కళింగ కోమటి నాయకులు జామి రవికుమార్, ఇప్పిలి గణేష్, పొట్నూరు జగదీశ్వరరావు, గుడ్ల వెంకటరమణ, పట్నాన మల్లేశ్వరరావు, కిల్లంశెట్టి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పరిశీలన



- నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యమ్ క్షేత్రస్థాయి పర్యటన

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 11:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యమ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సమిధా సింగ్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ ఆయన వెంట పాల్గొని జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతగిరి మండల కేంద్రంలోని కాఫీ కేంద్రాన్ని సందర్శించిన నీతి ఆయోగ్ సభ్యుడు కాఫీ సాగు, రైతుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అరకు లోయలోని చోంపి గ్రామాన్ని సందర్శించి అక్కడి గృహవసతి పర్యాటక కేంద్రాలను పరిశీలించారు. స్థానిక గిరిజనులతో నేరుగా మాట్లాడి వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పర్యాటక రంగంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. హుకుంపేట మండలం జామిగూడలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గుట్టులపుట్టు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విధానం ఆధ్వర్యంలో చేపడుతున్న సహజ సేద్యం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పరిశీలించి పంటల సాగు విధానాలపై రైతులతో మాట్లాడారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న విలువిద్య శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారిని ప్రోత్సహించారు. అనంతరం పాడేరు జీసీసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గిరిజనాభివృద్ధికి అమలు చేస్తున్న వివిధ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల ప్రయోజనాలు అర్హులైన గిరిజనులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి (పీ.వీ.టీ.జీ.) వెంకటేశ్వరరావు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలారం హై స్కూల్ లో సబ్జెక్ట్ టీచర్స్ బోధన లేక విద్యార్థులు ఇబ్బందులు...!



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 11:**
కొయ్యూరు మండలంలోని బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ ( ఫిజిక్స్)ఉపాధ్యాయులు లేక ఇక్కడ చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నమని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పూర్తి స్థాయిలో సబ్జెక్ట్ టీచర్స్ లేక బోధన లేని పరిస్థితిలో గత ఏడాది ఈ హై స్కూల్ నుంచి పదవ తరగతి పరీక్షలు వ్రాసిన 40 మందిలో కేవలం ఒకే ఒక్క విద్యార్థి మాత్రమే పాసైన సంగతి తెలిసిందే. అదే విధంగా గత ఏడాది ఇక్కడ పనిచేసే ఫిజిక్స్ ఉపాధ్యాయునీ కొయ్యూరు ఎం ఈ ఓ టూ కింద విద్యాశాఖ అధికార్లు ఆయనను బదిలీ చేయటంతో ఈ హై స్కూల్ లో ఆ సబ్జెక్ట్ టీచర్ లేక ప్రస్తుతం ఇక్కడ చదివే తరగతుల విద్యార్థులకు ఆ సబ్జెక్ట్ బోధనకు నోచుకోవడం లేదు. అప్పటి నుండి నేటి వరకు ఆ సబ్జెక్ టీచర్ లేక విద్యార్థులు గత ఏడాది పరిస్థితి కే వచ్చే విధంగా ఉంటుంధని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. అల్లూరి జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే బాలారం ఉన్నత పాఠశాలకు ఫిజిక్స్ సబ్జెక్ట్ టీచర్ ను నియామకం చేసి ఆదుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వంచుల ఎంపీపీ పాఠశాలలో విద్యాశాఖ అధికారుల తనిఖీ

విద్యాబోధన, మధ్యాహ్న భోజనంపై ఆరా



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన అధికారులు వారి విద్యా ప్రగతి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత, మెనూ అమలు తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి--1 ఎల్. రాంబాబు, మండల విద్యాశాఖ అధికారి--2 రామన్న, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నిరాధార ఆరోపణలు మానుకోవాలి,

- కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు ఎమ్మెల్యే జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 11 పెన్ పవర్.** కురుపాం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ కేడర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలతో పలు అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే తో ఇక జగదీశ్వరి మాట్లాడుతూ,వైసీపీ నాయకులు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని వైసీపీ నేతలు ఆరోపించడం దారుణమన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధానాలను ప్రజలు గమనించారని,ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వీకరిస్తుందని,అయితే రాజకీయ లబ్ధి కోసం చౌకబారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వైసీపీ నాయకులు ఆరోపణలకు స్వస్తి పలికి ప్రభుత్వానికి సహకరించాలని,ప్రజా సమస్యల పరిష్కారం,రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు. టీడీపీ నాయకులు,కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని,పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీహెచ్ఎన్ఎస్సీ సమావేశంలో సీజనల్ వ్యాధులు, క్షయపై చర్చ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 11:** మండలంలోని రింతాడ పంచాయతీలో గ్రామ ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణపై అవగాహన కల్పించేందుకు గ్రామ ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణ కమిటీ (వీహెచ్ఎన్ఎస్సీ) సమావేశం మంగళవారం నిర్వహించారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆధ్వర్యంలో, ఈక్విప్ ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులు డాక్టర్ వై.ఎస్. కుసుమ మార్గదర్శకత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎయిమ్స్ బృందం సభ్యులు శ్రీనివాసు, రాజు గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కలరా, టైఫాయిడ్, హెపటైటిస్--ఏతో పాటు మలేరియా, క్షయవ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణకు సంబంధించిన సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడమే వీహెచ్ఎన్ఎస్సీ కమిటీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి నెల మొదటి శుక్రవారం కమిటీ సమావేశాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో మానసిక ఆరోగ్యంపై కూడా అవగాహన కల్పించారు. మానసిక సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, అవసరమైన వారికి మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, సమస్య ఉన్న వారిని గుర్తించి తగిన వైద్య సేవలకు పంపించడం వంటి అంశాలను ఎయిమ్స్ బృందం వివరించింది. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా, పూర్తి వ్యవధి తీసుకోవాలని, మధ్యలో మందులు నిలిపివేయడం వల్ల వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉందని వివరించారు. క్షయ లక్షణాలు ఉన్న వారిని త్వరగా గుర్తించి పరీక్షలు, చికిత్స కోసం ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. 2030 నాటికి దేశం నుంచి క్షయవ్యాధిని నిర్మూలించే లక్ష్యంతో చేపడుతున్న 'క్షయరహిత భారత్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులు తమ ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణకు సంబంధించిన సమస్యలను వీహెచ్ఎన్ఎస్సీ సమావేశాల్లో తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ బృందం సభ్యులు శ్రీనివాసు, రాజు, క్షయవ్యాధి సీనియర్ చికిత్స పర్యవేక్షకుడు అశోక్, క్షయవ్యాధి సీనియర్ ప్రయోగశాల పర్యవేక్షకుడు రావు, మానసిక ఆరోగ్య సిబ్బంది నిర్మల, మధులత, సచివాలయ ఏఎన్ఎంలు ప్రవళిక, పద్మకుమారి, ఆరోగ్య సహాయకుడు సత్యనారాయణ, రింతాడ--1, రింతాడ--2 ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన కార్యకర్తలతోనే బలమైన పార్టీ.

- కురుపాంలో వైద్య పరీక్షల శిబిరంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ డ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 11 పెన్ పవర్.** కురుపాం మండల కేంద్రంలో కురుపాం కోట లో మంగళవారం నాడు కురుపాం మండల తెలుగుదేశం పార్టీ కేడర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు పార్టీ కార్యకర్తల సంక్షేమాన్ని కూడా సమానంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న టీడీపీ కేడర్‌కు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు వైద్యుల సలహాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్,ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు,రాష్ట్ర కార్యదర్శిలు బొంగు సురేష్,బిడ్డిక పద్మావతి,అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు,వట్టిగెడ్డ రిజర్వాయర్ చైర్మన్ యం సత్యంనాయుడు,మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్,పిఎసిఎస్ చైర్మన్ గుల్లిపల్లి సుదర్శన్ రావు,మండల కన్వీనర్ కె.వి.కొండయ్య,రాగాల అప్పలకొండ,పార్టీ నాయకులు,కార్యకర్తలు, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జేసి కు వినతి

- సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ.
- ముంచంగిపుట్టు మండల ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 11.** ఆదివాసి గిరిజన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కు వినతి పత్రాన్ని ముంచంగిపుట్టు గిరిజన విలేకరుల సంఘం వినతి పత్రాన్ని సమర్పించారు. ముంచంగిపుట్టు మండలంలో వివిధ పత్రికలలో గత కొన్ని ఏళ్లుగా పాత్రికేయ రంగంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న ఆదివాసి గిరిజన విలేకరులకు గృహాలు నిర్మించుకొనుటకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంగళవారం జేసికు లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని సమర్పించమని ముంచంగిపుట్టు మండల ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం అధ్యక్షకార్యదర్శిలు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు గత 15ఏళ్లుగా విలేకరి వృతినీ నమ్ముకొని ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా సేవలందిస్తున్నామని, కనీస వేతనాలు లేకుండా ప్రజాసేవకే, విలేకరి వృతికె అంకితం అయ్యామన్నారు. గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని వినతిపై.. ప్రతి విలేకరికి కనీసం మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని, సానుకూలంగా స్పందించి రెండు మూడు రోజులలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటానని జెసి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కరించేందుకు



ముంచంగిపుట్టు మండల తహసిల్దార్ కు ఆదేశాలు జారీ చేస్తానని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ విలేకరులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు ఏపీ టిఆర్ఎ అధ్యక్ష కార్యదర్శులు కాంతరు మోహన్, కూడా మోహన్, కోశాధికారి పాంగి భాస్కర్ రావు, సంఘ సభ్యులు గంపరాయి కోటేశ్వరరావు, కూడా అనిల్ కుమార్, కిముడు రాంబాబు, పాంగి పులి రాజు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం



- జ్ఞాన జ్యోతి 2వ దశ మొదటిరోజు శిక్షణ తరగతులు.
- మండల విద్యాశాఖ అధికారి కోడా కృష్ణమూర్తి, ఐసిడిఎస్ సిడిపిఓ యు విమలకుమారి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 11.** మండల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-ప్రైమరీ విద్యను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జ్ఞానజ్యోతి 2వ దశలో మొదటి రోజు శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించామని సిడిపిఓ యు వి ములకుమారి అన్నారు. మంగళవారం మొదటి రోజు శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పిల్లల బోధనా పద్ధతులు, ఆటల ఆధారిత అభ్యసనం, పిల్లల సమగ్ర అభివృద్ధి, బోధన--అభ్యసన సామాగ్రి, టిఎల్ ఎం వినియోగం, నవచేతన, ఆధార్ పాఠశాల సంసిద్ధత, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల వినియోగం, తల్లిదండ్రుల భాగస్వామ్యం తదితర అంశాలపై శిక్షణ అందించమన్నారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాల1లో శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖాదికారి కోడా కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు మహేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడి కార్యకర్తలు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు పూర్తిగా నేర్చుకుని అవగాహన కలిగి ఉండి అంగన్వాడి సెంటర్లు చిన్నారులకు చక్కటి ప్రీస్కూల్ విద్యా బోధ చేయాలని పలు సూచనలు సలహాలు అందించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ సమూహ కృత్యాల్లో పాల్గొని, గతంలో నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకున్నారు. 0--3 సంవత్సరాల పిల్లల సంరక్షణ, అభివృద్ధి, పోషణ, భద్రత, ప్రతిస్పందిత సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అనుకూలమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించడం, ఆటలు మరియు బోధన అభ్యసన సామాగ్రి ద్వారా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో చురుకుగా పాల్గొని, నేర్చుకున్న అంశాలను తమ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తామని అంగన్వాడి కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ పి లింగన్న, ఉపాధ్యాయులు ఆర్ పుండరీ, జి లోకేష్, అంగన్వాడి సూపర్వైజర్లు సిహెచ్ వరాహలమ్మ, ఎస్ రాజేశ్వరి, స్వర్ణ, ఎస్ కొండమ్మ, సీనియర్ అసిస్టెంట్ మత్తయ్య, బ్లాక్ కోఆర్డినేటర్ వి సురేష్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటగా రాజ్మాను సాగు చేసుకోవాలి.

ఏ డి ఏ బివి తిరుమల రావు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 11.** ఎల్ నినో ప్రభావం వలన రైతులు ప్రత్యామ్నాయ పంటగా రాజ్మాను అధిక విస్తీర్ణంలో సాగు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ( ఏడిఏ ) బీవీ తిరుమలరావు అన్నారు. మంగళవారం ఏడిఏ వ్యవసాయ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ విలేకరులతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రైతులు ప్రత్యామ్నాయ పంటగా రాజ్మాను అధిక విస్తీర్ణంలో సాగు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రైతులకు విత్తనాలను 90% రాయితీపై పంపిణీ చేసేందుకు 4900 క్వింటాలను రైతు సేవా కేంద్రాలకు తరలించామన్నారు. మొలక శాతం పరీక్షలు జరుగుతున్నాయని ఈ ఫలితాలు రాగానే రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. గిరిజన ప్రాంతంలో రాజ్మా సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు అదనంగా జిల్లాకు 2000 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం పంపిస్తుందన్నారు అలాగే గిరిజన రైతుల వ్యవసాయ ప్రగతికి ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ( ఎఫ్ పి ఓ) ఏర్పాటు చేస్తుందన్నారు గిరిజన ప్రాంతంలో రైతులకు ప్రభుత్వ పథకాలు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు తొలి విడతగా ప్రతి మండలానికి రెండు చొప్పున ఎఫ్ బి ఒ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఎఫ్ పి ఓ ల పరిధిలో 11 మందికి పైగా రైతులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎఫ్ పి ఓ పరిధి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందించడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు మార్కెటింగ్ చేసుకోవచ్చు. ఎఫ్ బి ఓ లకు వ్యవసాయ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఎఫ్ పి ఓ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నామన్నారు. ఆదివాసి రైతులు ఎఫ్ పి ఓ లో చేరింది ఆసక్తి కనబరుస్తున్నారు. వంటి మంచి సదవకశాలని సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు టి. మధుసూదనరావు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## నూతన పద్ధతులు రైతులు పాటించాలి.



- వరి పొలంలో నూకల వేతతో కలుపు నివారణ,
- బెల్లిడి గ్రామంలో ప్రయోగాత్మక పరిశీలన చేసిన ప్రకృతి వ్యవసాయ బృందం.

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 10 పెన్ పవర్.** వరి సాగులో రైతులకు సవాలుగా మారిన కలుపు మొక్కల యాజమాన్యం తరుణంలో,ప్రకృతి సిద్ధమైన మరియు తక్కువ వ్యయంతో కూడిన ప్రత్యామ్నాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి డిపిఎమ్ శ్రావణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నాడు గుమ్మలక్ష్మీపురం మండలం,బెల్లిడి గ్రామానికి చెందిన రైతు ఆరిక ఈరమని పొలాని ప్రకృతి వ్యవసాయం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఏఎస్ ఈడి టి బాబురావు నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఎం శ్రావణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ,వరి నాట్లు వేసిన తర్వాత నూకలు (విరిగిన బియ్యం)చల్లి కలుపు నివారణపై ఒక ప్రయోగాత్మక పరిశీలన నిర్వహించడం జరిగిందని. వరి పొలంలో నూకలు చల్లినప్పుడు,వాటిలో ఉండే పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్లు) నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులకు తక్షణ ఆహారంగా మారి వాటి సంఖ్యను పెంచుతాయని,ఈ క్రమంలో విడుదలయ్యే సహజ ఆమ్లాలు మరియు నానిన నూకల పొర వల్ల కలుపు విత్తనాలకు సూర్యరశ్మి,ఆక్సిజన్ అందక కలుపు పెరగకుండా ప్రారంభ దశలోనే నిరోధించబడుతుందని అన్నారు. ఈ ప్రయోగం ద్వారా గమనించడం జరిగింది. అంతేకాకుండా,ఈ నూకలు మట్టిలో కరిగి నేలలో సేంద్రీయ కర్బనాన్ని పెంచి పైరుకు పోషకాలను అందించడంతో పాటు రసాయన కలుపు మందుల వాడకాన్ని తగ్గించి రైతుకు సాగు వ్యయాన్ని ఆదా చేయవచ్చని అన్నారు. ప్రకృతి సాగులో భాగంగా చేపట్టిన ఈ ప్రయోగం యొక్క ఫలితాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట,దీని ఆధారంగా రైతులకు తగిన సూచనలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్షేత్ర పర్యటనలో భాగంగా గుల్లలంక గ్రామంలో మండంగి రెడ్డిరావు కేడర్ జీడి తోటలో గల అంతర పంటలను,చింతలపాడు గ్రామంలో రాగి మరియు ప్రత్తి పంటలను పరిశీలించి 3-4 వరుసల మధ్య ఎల్ నినో దృష్ట్య పలు రకాల మిశ్రమ పంటలను విత్తన గుళికలు చేసి వెయ్యాలని కేడర్ కు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.టి.గణేష్,నూకం నాయుడు,మరియు క్యాడర్ ప్రతినిధులు పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమాయత్తం



### టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 11:** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సీలేరు పంచాయతీలో కూటమి నాయకులు సమావేశం నిర్వహించి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు పరస్పర సమన్వయంతో, ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సాధారణ ఎన్నికల మాదిరిగానే ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి గ్రామంలో పార్టీ బలాబలాలను అంచనా వేసి, బూత్ స్థాయి నుంచి కూటమి శ్రేణులను సమాయత్తం చేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం సహకరించుకుంటూ సమన్వయంతో పనిచేయడం ద్వారా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు గొర్లె వీరవెంకట్, టిడిపి మండల అధ్యక్షుడు పొత్తురు కొండలరావు, టిడిపి కార్యదర్శి పసుపులేటి నాగమణి, జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, గడుతూరి పరమేశ్వరరావు, జాగరపు బాలకృష్ణ, వి. రాము, చక్రరావు, సత్తిబాబు, కుల్దీప్ దేవదాస్, ఎస్.కె. నాగూర్ మీరా, సన్యాసిరావు, బోర్ర కృష్ణ, గోవింద్, బీజేపీ మండల అధ్యక్షులు కాకూరి శేఖర్, చదరం మారిబాబు, భాస్కరరావు, కిముడు ముంది తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డుల్లో నాయకత్వం లేదు, సమన్వయం లేదు: తూర్పు వైసీపీలో కార్యకర్తల అసంతృప్తి





**విశాఖ తూర్పు, పెన్ పవర్, ఆగస్టు 11:**ఒకప్పుడు వేలాది మంది కార్యకర్తలతో దూసుకెళ్లిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఇప్పుడు గ్రౌండ్ స్థాయిలో పట్టు సడలుతోంది. నాయకత్వ లోపం, సమన్వయం లేమి, కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో పార్టీ క్రమంగా బలహీనపడుతోందనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

సోమవారం 13వ వార్డులో నిర్వహించిన నిరసన ర్యాలీనే ఇందుకు పెద్ద ఉదాహరణ. గతంలో వేలల్లో తరలివచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇప్పుడు మూడు అంకెల సంఖ్యను కూడా దాటలేకపోయారు. ర్యాలీలో మేధావులు, నిరుద్యోగ యువత కనిపించకపోవడంతో పార్టీకి ప్రజలతో అనుసంధానం తెగిపోతోందనే చర్చ మొదలైంది.

వార్డుల్లో నాయకత్వ శూన్యత

ముఖ్యంగా 10, 11, 12, 13 వార్డుల్లో బలమైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ కార్యకలాపాలు నీరుగారిపోతున్నాయి. ఉన్న కొద్దిమంది నాయకులు కూడా అవసరం ఉన్నప్పుడు మాత్రమే కార్యకర్తలను ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రజల ఓట్లతో గెలిచిన ప్రతినిధులు పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి స్వప్రయోజనాల కోసం పార్టీని వీడడం, నమ్మిన కార్యకర్తలను గాలికి వదిలేయడంతో కిందిస్థాయి కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

ఫ్లెక్సీలకే పరిమితం

అధిష్టానం నియోజకవర్గ స్థాయిలో సమన్వయకర్తలను, వార్డు స్థాయిలో అధ్యక్షులు, సమన్వయకర్తలను నియమించినప్పటికీ వారు ప్రజలకు చేరువ కావడం లేదు. ఫ్లెక్సీ బోర్డులు, మీడియా సమావేశాలకే పరిమితమై వ్యక్తిగత ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారే తప్ప వార్డుల్లో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే వారు కరువయ్యారు.

ఎప్పుడో ఒకసారి జరిగే జన్మదిన వేడుకలు, శుభకార్యాలకే పార్టీని ఉపయోగిస్తున్నారే తప్ప ప్రజా సమస్యలపై పోరాడే అపోజిషన్ లేకపోవడం పార్టీకి తీరని నష్టం కలిగిస్తోంది.

నాయకత్వంపై విమర్శలు


నగర మహిళా అధ్యక్షురాలు మొల్లి అప్పారావు, తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణకుమారి పార్టీ కార్యాలయాలకే పరిమితమై ఉండటంతో వార్డు వారీగా పార్టీని బలోపేతం చేయడంలో, నాయకులను ఐక్యపరచడంలో దాదాపుగా విఫలమవుతున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. నాయకత్వంలో ఐక్యత లేకపోవడంతో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్న పరిస్థితి.

అధిష్టానం చర్యలు కోరుతున్న కార్యకర్తలు

ఇప్పటికైనా అధిష్టానం స్పందించి వార్డుల వారీగా నాయకులను ఐక్యపరిచి, కార్యకర్తలను సమన్వయపరిచి వారిలో మనోధైర్యం నింపాలని కోరుతున్నారు. స్థానిక సమస్యలపై నాయకులు పట్టు సాధించి, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని, "మేమున్నాం" అనే భరోసా ప్రజలకు ఇవ్వాలని స్థానికులు, పార్టీ అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బలమైన పార్టీ అయినా సరైన సమన్వయం లేకపోతే తూర్పు నియోజకవర్గంలో పట్టు కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## ఘనంగా శ్రీ తలంపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు

**సప్త నదీ జలాలతో అమ్మవారికి విశేష అభిషేకం**





**పెన్ పవర్ ప్రతినిధి (తుని) లోవ ఆగస్టు 11**

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని లావా గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తలంపులమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి సహస్ర కటాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర పూజ, మండపారాధన, కలశ స్థాపన, పుణ్యాహవచనం, పవిత్ర సప్త నదీ జలాల ఆవాహన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. విశ్వనాథరాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పెంటకోట భాస్కర సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ తలంపులమ్మ అమ్మవారి మూలవిరాట్‌తో పాటు పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పవిత్ర సప్త నదీ జలాలతో అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించి, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. దీంతో ఆషాఢ మాస మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ముగియనున్నాయి.

# ఆరోహన్ ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ




**సొసైటీ అధ్యక్షులు సురేఖ పట్నాయక్, బాబురావు సహకారం తో**


**జి.మాడుగుల పెన్పవర్ ఆగస్ట్(11)** మండల పెసా ఫోరమ్ అధ్యక్షులు లకే రామకృష్ణటీమ్ కొర్ర చిన్నబ్బాయి. బోయిని. సింహాచలం.బాలకృష్ణ ఆధ్వర్యంలో సోలాభం పంచాయతీ గొంది పాడు ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కు 20 మంది నోట్ బుక్స్ పిల్లలకు ఇవ్వటం జరిగింది, అలాగే రచ్చపల్లి, ఎంపీపీ స్కూల్ లో 18,మంది పిల్లలు బుక్స్ ఇవ్వటం జరిగింది, జి. మాడుగుల మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణి అనాధ పిల్లలకు 26 మంది కీ నోట్ బుక్స్ ఇవ్వటం జరిగింది.

జి. మాడుగుల గాంధీనగరం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మత్స్యరాస. మత్యరాజు ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణి కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నావారు టీడీపీ జి. మాడుగుల పంచాయతీ అధ్యక్షులు కూడ ఖ.ఎ.ప్రసాద్ మాసడి సింహాచలం. మరియు తదితరులు పేరెంట్స్ హాజరయ్యారు

# బోధనా పద్ధతులు పిల్లలకి అనుగుణంగా ఉండాలి

**అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ**

**జి.మాడుగుల.పెన్ పవర్ ఆగస్ట్(11)** చిన్నారుల వయస్సుకు అనుగుణంగా నూతన బోధనా పద్ధతులను అవలంబిస్తూ, ఆటల ఆధారిత అభ్యాసం ద్వారా వారిలో సమగ్ర అభివృద్ధి సాధించాలని సీడీపీవో చి. బాలచంద్రమణిదేవి సూచించారు. జి.మాడుగుల మండలంలోని మూడు క్లస్టర్ల అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. 0--3, 3--6 సంవత్సరాల పిల్లల మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు, ఆటల ద్వారా అభ్యాసం, నూతన బోధనా విధానాలపై శిక్షణ ఇచ్చారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ తప్పనిసరి అని సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమ, మాణికుమారి, అర్పిలు రామచంద్రుడు, శ్రీను, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## నీటి సంరక్షణ పనులపై కేంద్ర బృందం పరిశీలన

**జల సంచయ్ జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11 :**గండేపల్లి: జల సంచయ్ జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా గండేపల్లి మండలంలోని జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట పంచాయతీల పరిధిలో చేపట్టిన నీటి సంరక్షణ పనులను కేంద్ర బృందం పరిశీలించింది.

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర జల సంఘం జూనియర్ ఇంజినీర్ ప్రఫుల్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల పురోగతి, వాటి నాణ్యత, నీటి నిల్వలు పెంచేందుకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నీటి వనరులను సంరక్షించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూగర్భ జలాలను పెంపొందించడం కోసం గ్రామస్థాయిలో చేపట్టే పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పెద్దాపురం డివిజన్ సహాయక ప్రాజెక్టు సంచాలకులు ఎం. భానుప్రకాశ్, గండేపల్లి ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి, ఏపీవో ఎం. రామకృష్ణంరాజు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## లోతేరు కొండవీధి లో కలకలం.

**వాంతులు విరోచనాలతో ఒకరు మృతి. ఇద్దరినీ స్థానిక ఆసుపత్రిలో తరలింపు.**



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 11:** అరకులోయ మండలం లోతేరు పంచాయతీ, లోతేరు కొండవీధి లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది గత కొన్ని గంటల్లోనే వాంతులు విరోచనాలు వ్యాపించడంతో ఒకరిని స్థానిక హాస్పటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యంలో దూసరి, చంటి (28). మరణించగా మరో ఇద్దరినీ స్థానిక ఆసుపత్రికి వారి కుటుంబ సభ్యులు తరలించారు. ఈ సంఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కలుషిత నీరు లేదా ఆహారం వల్ల ఇలాంటి వ్యాధి ప్రబలి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పరిస్థితి మరింత చేయి దాటకముందే ఉన్నత అధికారులు, వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి వెంటనే ప్రత్యేక (మెడికల్ క్యాంప్) వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ను స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# రూ. 3.40 కోట్లతో మోరంపూడి ఫ్లైఓవర్ సర్వీసు రోడ్ల పనులు

**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 11:** కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద రెండు వైపుల , సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకుల విధ్వంసకర పరిపాలన తో అభివృద్ధి పనులు అస్తవ్యస్తమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నా రన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ సమస్య ఒకటన్నారు. గత కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురిచేయడం, కమీషన్ల కోసం వేధింపులకు పాల్పడరని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం లో కూడా అదే కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగించే అవకాశం కల్పించామని, పనులు చేయలేనని చెప్పినట్లు తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి జోక్యం చేసుకుని కొత్త టెండర్ తో ఫ్లైఓవర్‌కు ప్రధాన పనులతో పాటు సర్వీస్ రోడ్ల నిర్మాణానికి రూ.3.40 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. జొన్నాడ, ఉండ్రాజవరంల్లో కూడా పనులు చేసేందుకు సుమారు రూ.7.50 కోట్ల మేరకు పనులు జరుగుతాయని వెల్లడించారు.

తాను జూలై 31న నిర్వహించిన మీడియా సమావేశంలోనే ఆగస్టు రెండో వారంలో మోరంపూడి సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని, చెప్పానని ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తుచేశారు. ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. క్రెడిట్ చోరీలో గొడ్డలి పార్టీ వాళ్లు సిద్ధహస్తులుగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యలు చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారం రోజుల్లో సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేస్తామని హైవే పీడీ తెలిపారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. మోరంపూడి ప్రాంతం సమస్య సిటీ, రూరల్ శాసనసభ నియోజకవర్గాల పరిధికి సంబంధించినదని ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. కొంత భాగం సిటీ , మరికొంత భాగం రూరల్ లో ఉందన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా ఈ సమస్య



పరిష్కారానికి ఫాలోఅప్ చేశారని, తాను కూడా అధికారులతో సమన్వయం చేశానని తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు. . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- గ్రీవెన్స్‌కు 112, రెవెన్యూ క్లినిక్‌కు 30 దరఖాస్తులు
- సమస్యల పరిష్కార మార్గాలు అన్వేషించి సంబంధిత అధికారులకు పంపిస్తాం
- కలెక్టర్ దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 11:** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్), రెవెన్యూ క్లినిక్ ద్వారా అందుతున్న దరఖాస్తుల్లో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తుండగా, మరికొన్నింటికి పరిష్కార మార్గాలను అన్వేషించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తున్నామని చెప్పారు.సోమవారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు.ఈ వారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 112 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌లో 30 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, అర్హత మేరకు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పరిష్కరించగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇతర సమస్యలపై తీసుకున్న చర్యలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డీఎన్‌వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ షేక్ షరీఫ్, డీఎంహెచ్‌ఓ పి. సరిత, సీపీఓ వెంకట్రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవదానం, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, ఐసీడీఎస్ జిల్లా అధికారి కె. ఉమా, జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు తదితర జిల్లా స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్లు, సీడీపీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కేవలం అర్జీలు ముగించడం కాదు... బాధితులకు పూర్తి న్యాయం జరగడమే ముఖ్యం

తప్పుడు ఎండార్స్‌మెంట్లు, క్షేత్రస్థాయి విచారణ చేయని అధికారులకు హెచ్చరిక

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 11:**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విచారించి నాణ్యమైన పరిష్కారం చూపాలని పొలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ వారాంతపు సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ (పోలీస్) జావాళి, ఆర్డీవో కె. స్వాతి మరియు జిల్లా స్థాయి అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ శాఖల ఫిర్యాదుల పరిష్కార తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన "సూపర్ ఆడిట్" మరియు "మీకోసం" కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్ పరిశీలనలో అనేక శాఖల్లో అర్జీల పరిష్కారంపై తీవ్ర లోపాలు బయటపడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.నాణ్యమైన పరిష్కారమే అసలైన కొలమానం

పోర్టల్‌లో అర్జీలను కేవలం సంఖ్యల కోసం క్లోజ్ చేయకుండా, బాధితుడికి నిజమైన ప్రయోజనం చేకూరే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారుల పనితీరును "ఫిర్యాదుల ముగింపు శాతం"తో కాకుండా ప్రజల సంతృప్తి ప్రాతిపదికన మాత్రమే అంచనా వేస్తామని తెలిపారు.క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి

రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకోవాలని ఆదేశించారు.అర్జీదారులతో

మాట్లాడకుండా, సరైన విచారణ చేయకుండా అర్జీలను తోసిపుచ్చడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.బలహీన వర్గాల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ

ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు, వృద్ధులు, మహిళలు మరియు నిరక్షరాస్యుల నుండి వచ్చే ఫిర్యాదులపై అధికారులు మరింత మానవీయ దృక్పథంతో స్పందించి తగిన న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు.

జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి శాఖలో నమోదవుతున్న రెవెన్యూ, రీ–సర్వే, తాగునీరు, పంచాయతీ సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లా అధికారులు తమ క్షేత్రస్థాయి సిబ్బందితో తరచూ సమీక్షలు నిర్వహించి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం మెడికో ప్రియాంక కేసు పై సమగ్ర విచారణ

నిందితులపై కఠిన చర్యలు తప్పవని మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు వెల్లడి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 11:** మెడికో ప్రియాంక మృతి పట్ల కూటమి ప్రభుత్వం విచారం వ్యక్తం చేస్తుందని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతోందని కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు , బిజెపి నాయకులు స్పష్టం చేశారు.

ఈ ఘటనపై సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ లు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సీఎం ఆదేశాల మేరకు బాధితు రాలి కుటుంబానికి ప్రభుత్వం వైద్య ఖర్చులతో పాటు రూ. 20 లక్షల పరిహారంతో పాటు, జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ యాజమాన్యం మరో రూ.20 లక్షల రూపాయలు

అందజేయడం జరిగింద న్నారు. స్థానిక మోరంపూడి శుభమస్తు కళ్యాణ మండపంలో మంగళవారం కూటమి ఎమ్మెల్యేలు, తెలుగుదేశం, బిజెపి నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో చికిత్స పొందుతూ వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ విచారకర ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిం దన్నారు.ఈ ఘటన మూడు రోజులు పాటు వ్యవస్థలు బయటకు తీసుకురాకపోవడం దారుణం అన్నారు. నింది తులకు సేవిస్తేనే ఇంతటి దారుణాలకు ఓడిగడతారని, ఆ పరీక్ష ఫలితాలు పోలీసులు భద్రం చేయాలని, హత్యనేరం సెక్షన్లు మోపాలన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రియాంక మృతి విచారకరమని ,బాధిత రాలి తండ్రికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చామన్నారు నిందితులకు పరంగా చట్టపరంగా కఠిన శిక్షలు పడేలాగా సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ కేసులో ఎన్నో అనుమానాలు ఉన్నాయని అయితే అన్నింటికీ సమాధానం చెప్పడానికి ఇది సమయం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిందన్నారు. అనపర్తి బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రియాంక మృతి రాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతి కలిగించింద న్నారు. పోలీసు దర్యాప్తులో గోప్యం అవసరమని, అయితే ,అనుమానాలకు తావు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిందితులపై చట్ట, న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటుం దన్నారు. నిందితుల నిందితుల సమగ్ర విచారణ కోరుతూ కస్టడీ పిటిషన్ కూడా పోలీసులు కోర్టులో వేశారన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, మద్యం మత్తులో నిర్లక్ష్యంతో నిండు ప్రాణాన్ని బలితీసుకున్న నిందితులను విడిచిపెట్టేది లేదన్నారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ మంత్రి లోకేష్ ఆదేశించారన్నారు.

మూడు రోజులపాటు వెల్లడి కాకపోవడంలో మీడియా నైతికతను ఆయన ప్రశ్నించారు. దీనిపై మీడియా ప్రతినిధులు కూడా ఈ ఘటనపై రాజకీయ జోక్యం కూడా ఉందని ప్రతి స్పందించారు. ఘటనతో సంబంధం కలిగిన ప్రతి అంశంతో సాక్ష్య దారాలతో సహా సమగ్ర విచారణ చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తామని వెల్లడించారు.విముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తక్షణమే స్పందించి తగిన చర్యలకు ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని, తగిన న్యాయం చేకూరుస్తుందని ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు హాజరు కాలేదు.

## ఈనెల 15 ,16 తేదీల్లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో ఎడ్యు ఫెయిర్

- విద్యార్థులకు విద్యతో పాటు జ్ఞాన సముపార్జన
- మీడియా సమావేశంలో స్కూలు యాజమాన్యం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 11:**ప్రపంచవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పు, అభివృద్ధి కనిపిస్తోందని వాటికి వాటిని అందిపుచ్చు కునేలాగా దేశీయంగా విద్యార్థులను తయారు చేస్తున్నామని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ యాజమాన్యం స్పష్టం చేసింది. స్కూలు ఆవరణలో మంగళవారం మీడియా సమావేశంలో ఫ్యూచర్ కిడ్స్ విద్యాసంస్థల చైర్మన్ ఏలేటి రవిబాబు మాట్లాడుతూ, మారుతున్న ఆధునిక సమాజానికి అనుగుణంగా నేటి విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సైన్సు ఇతర రంగాల్లోనూ తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఆ క్రమంలో భాగంగా ఈ నెల 15, 16వ తేదీల్లో తమ స్కూలు ఆవరణలో ఎడ్యూ ఫెయిర్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నేటి తరం విద్యార్థులు చాలా తెలివైన వారిని వారి తెలివితేటలు సక్రమమైన రీతిలో ప్రభుత్వాలు ,విద్యాసంస్థలు, తల్లిదండ్రులు ఒక సమిష్టి తత్వంతో పని చేసినట్ల యితే దేశం గణనయమైన ప్రగతి సాధిస్తుందని అన్నారు.2050 నాటికి దేశం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో దేశంలో విద్యా వ్యవస్థ మారాలని, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా నైపుణ్య వంతులుగా చేయాల్సి ఉందన్నారు. రెండు రోజుల ఎద్యు ఫెయిర్ లో 300 ప్రదర్శనలు నిర్వహిస్తారని, వాటిలో 100 వరకు నేటి సమాజానికి వినియోగపడే శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయన్నారు. నేటి ఆధునిక కాలంలో ఏఐ క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ ల పై ప్రదర్శనలు ఉంటా యన్నారు. ముఖ్యంగా లింగ్విస్టిక్ సెక్షన్ లో మాతృభాషతోపాటు ఇంగ్లీషు, కనీసం ఒకటైన విదేశీ భాష ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తమ స్కూల్ విద్యార్థులు ఒకే ప్రాజెక్టులో విద్యార్థులు అందరూ పనిచేస్తారని అందరికీ జ్ఞానం వస్తుందన్నారు.తమ స్కూలు విద్యార్థులు క్రీడా పోటీల్లో కూడా భాగస్వా మ్యం వహిస్తారని

అన్నారు. ఈనెల 22న జాతీయ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 86 మంది విద్యార్థులు పాల్గొంటార న్నారు. స్కూల్ ఉపాధ్యా యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ తీర్మానం ప్రకారం ప్రపంచ దేశాల్లో విద్య విధానాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 2050 నాటికి మార్పు చెందాల్సిందన్నారు. ఆ దిశగా తమ స్కూలు గత 25 సంవత్సరాలుగా అదే లక్ష్యంతో పని చేస్తుంద న్నారు. ఈ సమావేశంలో స్కూలు ఉపాధ్యాయులు హర్షిణి దేవి, సైరా బాను, శ్రీవల్లి ,దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన డీఎస్పీ, ఎమ్మెల్యే
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరు పై మార్గాని భరత్ ఆగ్రహం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , ఆగస్టు11:**నగరంలో సంచలనం సృష్టించిన మెడికో ప్రియాంక ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టాలని, కేసు తీవ్రత దృష్ట్యా నిందితులపై హత్య యత్నం సెక్షన్లు పెట్టాలని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నగర ప్రజల్లో ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయన్నారు

ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు, మీడియా, థియేటర్ యాజమాన్యంపై ఎన్నో అనమానాలు వ్యక్తమవు తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయం కోసం తాను హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆమెను కారుతో డీ కొట్టి తీవ్రంగా గాయపరిస్తే 6వ తేదీ వరకు ఎందుకు బయటకు రాకుండా చేసారని ఆయన ప్రశ్నించారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లో వైసిపి సిటీ కార్యాల యంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజుల పాటు ఘటనను గోప్యంగా ఉంచారని, నిందితులను ఎవరు కాపాడారని ప్రశ్నించారు. దారుణ మైన ఘటనను చిన్న ప్రమాదంగా డిఎస్పీ చెప్పడం, ఎమ్మెల్యే కేవలం అని ఉదహరించడం వారి బాధ్యత రాహిత్యాన్ని తెలుపుతుందన్నారు. ప్రత్యేక బృందంతో ఈ ఘటనపై విచారణ చేస్తేనే వాస్తవాలు బయటపడు తాయన్నారు.పలుమార్లు ఆమె స్కూటిని ఢీకొట్టి, తలపై నుంచి కారు నడిపిన ఘటనలో హత్య కేసు సెక్షన్లు నమోదు చేయక పోవడం వెనుక ఎవరి వత్తిడి ఉందన్నారు. బాధితరాలి కుటుంబానికి సంఘీభావంగా తాను ప్రజాస్వామ్యబద్ధంగా శాంతి ర్యాలీ చేసే తనను పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. నగరంలో షాపులు, బెల్ట్ షాపులతో విచ్చలవిడిగా మద్యాన్ని తాగించడం, మరోవైపు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టడం ద్వంద విధానాన్ని ఖండించారు. డాక్టర్ ప్రియాంక కుటుంబ సభ్యుల వాదనను పట్టించు కోలేదని ప్రకాష్ నగర్ పోలీస్ అధికారుల విచారణపై తమకు అనుమానాలు ఉన్నాయని, సి ఐ ను సస్పెండ్ చేసి, ఈ కేసులో నిందితునిగా చేర్చి ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిఐ బాజీ లాల్ ఆరోజు ఎవరెవరితో మాట్లాడారో ఫోన్ కాల్ డేటాను విచారించాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఘటనపై తెలంగాణ ప్రభుత్వం, సీఎం సీఎం రేవంత్ రెడ్డి, అక్కడ ప్రతిపక్ష పార్టీలు స్పందించాలన్నారు. కారుతో ఢీకొట్టిన తరువాత ప్రసాదిత్య మాల్ నుంచి ఎవరెవరికి ఫోన్లు వెళ్లాయి, ఏం మాట్లాడారన్నది కాల్ డేటా వెల్లడించాలని, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం పై విచారణ జరపాలని డిమాండ్ చేసారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టేవరకు వైసిపి తరపున ప్రియాంక కుటుంబానికి అండగా నిలబడతా మన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దారుణ ఘటనలు జరగకుండా నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్గాని భరత్ డిమాండ్ చేసారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com